భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలో వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మిక సంక్షేమానికి తగు చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ భవననిర్మాణ కార్మిక సంఘం, రాష్ట్ర నాయకత్వ బృందం బుధవారం వలవల బాబ్జీని కలిసి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ఆయనకు వివరించారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెల్ఫేర్ బోర్డు రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 46 వేల క్లైమ్‌లను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపి భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ(బుజ్జి), ప్రధాన కార్యదర్శి పడాల రమణ, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా..
గరగపర్రు సంపద తయారీ కేంద్రం!

- 2019లో నిర్మించినా వినియోగంలోకి తేని పంచాయతీ అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా సంపద కేంద్రం
- రోడ్డు పక్కన చెత్త వేయడంతో ప్రయాణికుల అవస్థలు
- కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాలు పట్టని అధికారులు

ఖాళీగా దర్శనమిస్తున్న బిడ్

ప్రజాశక్తి - భీమవరం

చెత్త నుంచి సంపదను సృష్టించి పంచాయతీల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలనే ముఖ్యోద్దేశంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నెలకొల్పారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ కేంద్రాలు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. గరగపర్రు సంపద తయారీ కేంద్రమే దీనికి నిదర్శనం. ఉన్న కేంద్రాన్ని నిరుపయోగంగా వదిలేసి గ్రామంలో సేకరించిన చెత్తను రహదారి వెంబడి డంప్ చేయడంతో స్థానికులు, ప్రయాణికులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. అయితే అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒక పక్క కలెక్టర్ చదలవాడ నాగరాణి, మరోపక్క జిల్లా పంచాయతీ అధికారి రఘునాథరెడ్డి గ్రామాలను సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. దీనిలో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ సర్వేక్షన్ పేరిట గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తీసుకున్న చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు తయారీ కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలని తరచూ ఆదేశాలిస్తున్నప్పటికీ గరగపర్రు పంచాయతీ అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. జిల్లాలో కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు మంచి ఫలితాలు ఇచ్చాయి. స్వతహాగా గ్రామ పంచాయతీలు వర్మీని తయారు చేసి వాటి అమ్మకం ద్వారా పంచాయతీలు ఆర్థిక అభివృద్ధి చెందుతున్నాయి. అయితే గరగపర్రులోని సంపద తయారీ కేంద్రాన్ని నిరుపయోగంగా వదిలేశారు. కేంద్రం నిర్వహణకు అన్ని వసతులూ ఉన్నప్పటికీ కేవలం పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో నిర్వహణకు దూరమైంది. 2019లో రూ.4 లక్షలతో సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించారు. తర్వాత మరికొన్ని నిధులు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దారు. అయితే ఏడేళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాని పరిస్థితి. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. పంచాయతీ కూడా ఏరోజు కారోజు సేకరణ చేయకపోవడంతో గ్రామస్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇళ్ల ముందే చెత్త కుప్పలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. అయితే ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామంలో తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. అయితే పంచాయతీ అధికారులు ఇవేమీ పట్టించుకోని పరిస్థితి.

రహదారి పక్కగా వేసిన చెత్తాచెదారం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా సంపద కేంద్రం..

గరగపర్రులో ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ యనమదుర్రు కాలువ గట్టుపై గ్రామానికి శివారున సంపద కేంద్రాన్ని నిర్మించారు. అయితే ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. ఈ కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోంది. దీంతో మందుబాబులు ఇక్కడే కూర్చుని మద్యం తాగుతున్నారు. అలాగే రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డంగా మారిందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయినా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

తాడేపల్లిగూడెం రహదారిలో చెత్త డంప్..

గ్రామంలో సేకరించిన చెత్తా చెదారాన్ని తడి, పొడి చెత్తగా వేరు చేయకుండానే భీమవరం-తాడేపల్లిగూడెం రహదారిలో డంప్ చేస్తున్నారు. ఇది కూడా సంపద తయారీ కేంద్రం అతి దగ్గరలోనే ఉండడం విశేషం. కేంద్రం దగ్గర్లో ఉన్నప్పటికీ అక్కడ చెత్త వేయకుండా సమీప రహదారి పక్కన పంచాయతీ డంప్ చేస్తోంది. ప్రధాన రహదారిలో చెత్త వేయడం వల్ల నిత్యం రద్దీగా ఉండే భీమవరం, తాడేపల్లిగూడెం రహదారి గుండా ప్రయాణించే వారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో అనేక ప్రమాదాలు జరుగుతున్న సంఘటనలు ఉన్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురాకుండా చెత్తాచెదారాన్ని రహదారి వెంబడి వేయడం పట్ల పంచాయతీ అధికారులు ఆంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. అయితే అధికారులు నిర్లక్ష్యానికి గ్రామస్తుల ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది.

చిట్టడవిని తలపిస్తున్న సంపద కేంద్రం

ప్రతి ఎకరాకూ సాగు నీరివ్వాలి

ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో నీటి సరఫరాను పర్యవేక్షించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

వరి సాగుకు అవసరమైన సాగునీటిని శివారు భూములకు సైతం ఆటంకంలేకుండా ప్రతి ఎకరాకూ అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణి సాగునీటి సరఫరాపై ఇరిగేషన్, డ్రెయిన్లు, ఎర్రకాలువ, గోదావరి హెడ్ వాటర్ వర్క్స్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి సాగుకు నీటి ఎద్దడి ఏర్పడకుండా శివారు భూములకు అవసరమైన నీరు సరఫరా జరిగేలా ఇరిగేషన్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సాగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా తూడు, గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను చూసి నిర్లక్ష్యం వహించొద్దని, వర్షాకాలంలో రెండు, మూడు మాసాలు అధిక వర్షాలు, వరదలు ఏ సమయంలోనైనా సంభవించే అవకాశం ఉందని, దీనికి తగినట్టుగా అన్ని విధాలా ఇంజినీరింగ్ అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. అనంతరం ఇరిగేషన్ కెనాల్స్, డ్రెయిన్లు సాగునీటి పారుదల సిస్టం మ్యాపులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, హెడ్ వాటర్ వర్క్స్ ఇఇ జి.శ్రీనివాస్, ఇరిగేషన్, డ్రైన్స్, ఎర్ర కాలువ, గోదావరి హెడ్ వాటర్ వర్క్స్ డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

గర్భధారణపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

మాతృ, శిశు ఆరోగ్యం కోసం గర్భాధారణ, బిడ్డకూ బిడ్డకూ మధ్య అంతరంపై దంపతులకు అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం దంపతులు ఒక బిడ్డతో సరిపెట్టుకుంటున్నారని, దానివల్ల భవిష్యత్తులో యువ జనాభా తగ్గిపోతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులు కాన్పులు చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కౌమార దశలో వివాహం, గర్భం దాల్చడం వల్ల వచ్చే ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. అంతరం మేము పిల్లలం - అప్పుడే కాము తల్లులం ఇక చాలు ఆపండి అనే రెండు గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ విభాగాల్లో లక్కీ డిప్ ద్వారా ఎంపికైన పది మంది తల్లులకు నగదు పురస్కారాలు, ఎక్కువ గర్భనియంత్రణ ఆపరేషన్లు చేసిన వైద్యులకు, ఆరోగ్య పద్ధతులపై ప్రోత్సహించిన వారికీ మెమెంటోలు అందజేశారు. డిఎంహెచ్ఒ జి.గీతాబాయి, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుధా లక్ష్మి, డిఇఒ ఇ.నారాయణ, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, ఐసిడిఎస్ పీడీ డి.లక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

స్మార్ట్ మీటర్లు ఆపకపోతే ఉద్యమం

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - తణుకు

అదాని స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలు ఆపకపోతే ప్రజా ఉద్యమం తప్పదని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం హెచ్చరించారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ విద్యుత్ పేరుతో ప్రజలపై భారాలు వేయడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం అదానీతో చేసుకొన్న ఒప్పందాలు కూటమి ప్రభుత్వం ఎందుకు అమలు చేస్తోందని ప్రశ్నించారు. గత ప్రభుత్వ కాలంలో పెంచిన విద్యుత్ ధరలు తగ్గిస్తామని చెప్పి 15 వేల కోట్లు ఎలా వేశారన్నారు. 2000లో కూడా విద్యుత్ భారాలు వేయడం వల్లే రాష్ట్రంలో పెద్దఎత్తున ఆందోళన జరిగిందని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెవిఎన్.గోపాలన్ మాట్లాడుతూ ప్రజలపై కూటమి ప్రభుత్వం భారాలు వేయడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. సిపిఎం జిల్లా సమావేశాలు ఈ నెల 25, 26, 27న తణుకులో జరుగుతున్నాయన్నారు. ఆర్థిక సహకారం కోసం తమ కార్యకర్తలు ఇంటింటికీ వస్తున్నారని ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలపై భారాలు మానుకోవాలని లేకుంటే ప్రజాగ్రహానికి కూటమి గురికాక తప్పదని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్, కేతా గోపాలన్, కర్రి నాగేశ్వరరావు జిల్లా కమిటీ సభ్యులు జి.రామకృష్ణ, బి.జార్జి, ఎం.త్రిమూర్తులు, కామన మునిస్వామి, పి.పూర్ణ, ఇంజేటి శ్రీనివాస్, డి.శ్రీనివాస్, శేషపు అశ్రియ్య, కానేటి బాలరాజు, కె.నర్సింహారావు, జవ్వాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

18న ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా

ధర్నాకు రావాలని ఎంఎల్‌సి గోపీమూర్తిని కోరిన డిఎస్‌సి 2003 టీచర్స్ ఫోరం సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం

డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు మెమో 57ను అమలు చేసి ఒపిఎస్‌లోకి తీసుకురావాలని ఈ నెల 18న ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు డిఎస్‌సి 2003 టీచర్స్ ఫోరం సభ్యులు తెలిపారు. స్థానిక పిడిఎఫ్ కార్యాలయంలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తిని ధర్నాకు రావాలని సభ్యులు కోరుతూ వినతిపత్రం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం సభ్యులు మాట్లాడుతూ అనేక ఇబ్బందుల మధ్య సతమతమవుతున్న డిఎస్‌సి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అలాగే 18న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్, యుటిఎఫ్, ఎస్‌టియు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులను ఆహ్వానించారు. గోపీమూర్తికి వినతిపత్రం అందించిన వారిలో ఫోరం సభ్యులు సిహెచ్ ప్రకాష్, శ్రీనివాస్, పెద్దిరాజు, బి.శ్రీనివాస్, రాజా రమేష్ ఉన్నారు.

గోపీమూర్తికి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయుల ఫోరం సభ్యులు

ఆక్రమణలు తొలగించాలి

డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు బుధవారం పలు ఆక్రమణలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొండాడ మేజర్ డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న మసీదు ప్రతినిధులు డ్రెయినేజీ వెంబడి బాత్‌రూమ్‌లు నిర్మించుకున్నారని, వాటిని వెంటనే తొలగించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పక్కనే ఉన్న ఇరిగేషన్ స్థలంలో నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలని రఘు రామ కృష్ణరాజును మసీదు ప్రతినిధులు కోరారు. అలాగే అరుంధతీపేట నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో డ్రెయినేజీ శాఖకు చెందిన స్థలాన్ని కొంతమంది ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారని, వాటిని వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను రఘురామ కృష్ణరాజు ఆదేశించారు. అనంతరం ఉండి సంత బజార్‌లో ఉన్న రైతు బజార్‌ను పరిశీలించి ఉండిలో ఉన్న మాంసం దుకాణ దారులందరూ ఈ రైతు బజారు ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, పంచాయతీ ఆదేశాలను ధిక్కరించి ఎవరైనా రోడ్ల వెంబడి మాంసం దుకాణాన్ని ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపై ఉన్న దుకాణాల్లో మాంసాన్ని వేలాడదీయడంతో ఆ గుండా వెళ్లే వాహనాల దుమ్ము మాంసంపైకి చేరడంతో వాటిని తిని ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. మాంసం దుకాణదారులు పంచాయతీ నుంచి స్టాంప్ వేయించుకుని విక్రయాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కరిమేరక నాగరాజు, డిసి ఛైర్మన్ తోట ఫణిబాబు, డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి జివి.సత్యనారాయణ, నాయకులు కిన్నెర వెంకన్న, కర్రి శ్రీనివాస్, మజ్జి కృష్ణప్రసాద్, నల్లా వల్లి పాల్గొన్నారు.

ఆక్రమణలను పరిశీలిస్తున్న రఘురామ కృష్ణరాజు

సొసైటీల అభివృద్ధికి కృషి

డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

నియోజకవర్గంలోని సహకార బ్యాంకుల అభివృద్ధికి కృషి చేస్తానని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. బుధవారం కలవపూడి సొసైటీ ఛైర్మన్, డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేశారు. సొసైటీ ఛైర్మన్‌గా మంతెన నర్సింహ మూర్తిరాజు, డైరెక్టర్లుగా పెన్మెత్స జానకి రామరాజు, వాతాడి రామారావులతో సొసైటీ డివిజనల్ అధికారి బి.సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ జిల్లాలోని సహకార బ్యాంకుల్లో ప్రథమ స్థానంలో ఉన్న మూడు ఉండి నియోజకవర్గంలో ఉన్నందుకు గర్వపడుతున్నానన్నారు. కలువపూడి సొసైటీ రుణాల బకాయి, వసూళ్లలో అగ్రస్థానంలో ఉందని తెలిసి ఆనందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఎపి ఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎంపిపి ఆరేటి వెంకట రత్నప్రసాద్, టిడిపి నాయకులు నంద్యాల రామరాజు (హాట్ లైన్స్ బాబు), మంతెన శివాజీరాజు, జివి.నాగేశ్వరరావు, కలవపూడి, కాళ్ల, కాళ్లకూరు సొసైటీల సిఇఒలు కనుమూరు శ్రీరామ వెంకట సత్య నరసింహరాజు, గనిశెట్టి వెంకట రామారావు, ఇబ్బా శ్రీనివాస్ పాల్గొన్నారు.


సొసైటీ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న నర్సింహమూర్తిరాజు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి అధికారుల విచారణ

ప్రజాశక్తి - నరసాపురం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం ఓ పాత కేసుకు సంబంధించి ఎసిబి అధికారులు విచారణ చేపట్టారు. ఉదయం 11 గంటల సమయంలో ఎసిబి సిఐ (ఏలూరు) ఎం.బాలకృష్ణ సిబ్బందితో కలిసి కార్యాలయాలనికి వచ్చి విచారణ చేపట్టారు. 2023లో వీరభద్రరావు సబ్‌రిజిస్ట్రార్‌గా ఉండగా అక్రమ భూ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదులు అందడంతో అప్పట్లో ఎసిబి అధికారులు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడులు నిర్వహించారు. ఈ వ్యవహారంలో అప్పటి సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యారు. ఈ కేసు దర్యాప్తు చివరి దశకు చేరడంతో సమగ్ర దర్యాప్తు నిమిత్తం మళ్లీ ఎసిబి అధికారులు విచారణ చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదుదారులతో పాటు, అప్పుడు జరిగిన కొన్ని రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వారితో కలిపి మొత్తం 15 మందికి నోటీసులు అందించిన ఎసిబి అధికారులు అందరినీ కార్యాలయానికి రప్పించి వారి నుంచి పలు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎసిబి సిఐ బాలకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ పాతకేసు దర్యాప్తులో భాగంగా విచారణ జరిపినట్లు చెప్పారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వివరించారు. ఎసిబి విచారణతో రోజంతా పూర్తిగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అధికారులు నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ చేపట్టడంతో మిగిలిన ప్రభుత్వ కార్యాలయంలో సిబ్బంది, ఉద్యోగులు, అధికారులు ఈ విషయంపై ఆరా తీస్తున్నారు.

మాట్లాడుతున్న ఎసిబి సిఐ బాలకృష్ణ

మహిళలపై పెరుగుతున్న దాడులు

ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

ప్రజాశక్తి - తణుకు

మహిళలపై రోజురోజూ దాడులు పెరిగిపోతున్నాయని, ఐద్వా నిరంతరం మహిళల సమస్యలపై అనేక పోరాటాలు చేస్తోందని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ అన్నారు. స్థానిక ఎన్‌జిఒ హోం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.పూర్ణ, జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ మాట్లాడుతూ పసి పిల్లల నుంచి వృద్ధుల వరకూ మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఒక పక్క మద్యం ఏరులై పారుతోందని తెలిపారు. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. బెల్ట్ దుకాణాలు నెలకొల్పి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని, మత్తు పదార్థాలు, మద్యానికి యువత బలైపోతున్నారని అన్నారు. ఉపాధి అవకాశాలు లేక మహిళలు తక్కువ వేతనాలకు పని చేస్తున్నారన్నారు. మహిళలు పౌష్టికాహారం లేక రక్త హీనతతో బాధపడుతున్నారన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇప్పటి వరకూ అమలు కాలేదని, ఉచిత గ్యాస్ బండలు అన్నారు అవి కూడా కొద్ది మందికే నామమాత్రంగా ఇచ్చారని విమర్శించారు. మహిళలందరూ ఏకమై ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎస్.జయప్రభ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.ఉదయకుమారి, పట్టణ కార్యదర్శి కె.నాగరత్నం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

దాడి కేసులో ముగ్గురికి జరిమానా

ప్రజాశక్తి - నరసాపురం

దాడి కేసులో నేరం రుజువు కావడంతో ముగ్గురు ముద్దాయిలకు న్యాయమూర్తి జరిమానా విధించినట్లు డిఎస్‌పి జి. శ్రీవేద తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. యలమంచిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని కుమ్మరిపాలెంలో 2019 మే 30న అయినపూడి నరసింహస్వామిని ముద్దాయి ఆకుమర్తి సూర్యారావు బూతులు తిట్టడంతో ఎందుకు నన్ను తిడుతున్నావని నరసింహ స్వామి అడిగాడు. దీంతో సూర్యారావు అతని ఎడమ చేతిని వెనక్కి తిప్పి గెంటేయడంతో రాయి మీద పడి పోవడంతో నరసింహస్వామి ఎడమ చేయి, మోచిప్ప విరిగాయని, సూర్యారావుకు సహకరించిన మరో ఇద్దరిపై ఫిర్యాదు చేశారని తెలిపారు. అప్పటి ఎస్ఐ జి.గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో ముద్దాయిలైన ఆకుమర్తి సూర్యారావు ఏరూబెన్, ఆకుమర్తి నాగేశ్వరరావు, ఆకుమర్తి ఏసుబాబు నేరం రుజువు కావడంతో నరసాపురం అడిషనల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) ఎస్.రాజ్యలక్ష్మి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరుపున బి.సిద్ధార్థ్ వాదనలు వినిపించారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన

తాడేపల్లిగూడెం : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో మధ్యవర్తిత్వంపై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు పరిష్కరించుకోవాలని, దానివల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ, ఫస్ట్ ఎడిషనల్ సివిల్ జడ్జి కె.లలితా దేవి, రెండవ అడిషనల్ సివిల్ జడ్జి అన్నామణి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిరిగినీడి విజయకృష్ణ, మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన న్యాయవాదులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ ఎంపిక

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో బుధవారం గెస్ట్ లెక్చరర్ ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికను చిట్టూరి ఇంద్రయ్య స్మారక కళాశాల తణుకు కంప్యూటర్ సైన్సు విభాగంలో పనిచేస్తున్న జ్యోతి కిరణ్మయి పర్యవేక్షణలో జరిగినట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి చెప్పారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూకి వచ్చిన డెమోను, విద్యార్హతలను పరిశీలించి ఎ.శాంతి ఎంసిఎను ఎంపిక చేసినట్లు చెప్పారు. అనంతరం సైన్సు విభాగంలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎఐ మీద కిరణ్మయి అవగాహన కల్పించారు. తమ కాలేజీకి వచ్చి గెస్ట్ లెక్చరర్‌ని ఎంపికచేసిన జ్యోతి కిరణ్మయిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూప రాణి, కె.గిరిబాబు, పివి.రమేష్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ తగాదాలు వద్దు : తహశీల్దార్

ఆకివీడు : సివిల్, ఆస్తి తగాదాలను 'మీకోసం' కార్యక్రమంలో ఫిర్యాదులు చేయవద్దని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ తగాదాల పరిష్కారానికి తాము తీసుకోవటం లేదని ఆయన స్పష్టం చేశారు. ఆమేరకు సివిల్ గొడవలకు సంబంధించిన దరఖాస్తులు ఎవరు ఇవ్వవద్దని ఆయన చెప్పారు. ఆ సమస్యలను, ఆ దరఖాస్తులను తాము తీసుకోము, లెక్కించము, పరిష్కరించేది లేదు అని ఆయన స్పష్టం చేశారు. ఆ రకమైన గొడవలు న్యాయస్థానం ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమమని ఆయన చెప్పారు. ఇటీవల కాలంలో 'మీకోసం' ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సివిల్ గొడవలు, ఆస్తి తగాదాలకు సంబంధించి దరఖాస్తులు ఎక్కువ వస్తున్నాయని, అందువల్ల ఈ రకంగా స్పందించవలసి వచ్చిందని వివరించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

పాలకొల్లు : పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో బుధవారం ఒక అనాథ(మూర్తి) మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా గత 3 సంవత్సరాలుగా పాలకొల్లులో పలు టిఫిన్ హోటల్స్‌లో పనిచేసేవారని, గత కొన్ని నెలలుగా పేగు వాపుతో బాధపడుతున్నారని చుట్టుపక్కల వారు పోలీసులకు తెలియజేశారు. ఆ మృతదేహానికి ఖననం చేయాలని పాలకొల్లు అమ్మ ఛారిటబుల్ ఫౌండేషన్ సభ్యులను కోరగా అమ్మ ఛారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు స్పందించి మృతదేహానికి పాలకొల్లు యడ్లబజార్ శ్మశాన వాటికలో ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పృథ్వి, కానిస్టేబుల్ నగేష్, శ్రీనివాస్, ట్రస్ట్ అధ్యక్షులు అంబటి సాయి తేజ, ట్రస్ట్ సభ్యులు కట్టా సాయికిరణ్, కందుల సాయి, అనిశెట్టి శ్రీరామదాసు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటుపై హర్షం

తాడేపల్లిగూడెం: అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టుకు స్థలం కేటాయించడంతో తాడేపల్లిగూడెం ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో తాడేపల్లిగూడెం శ్రీఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మనాభుని మురళీమోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తిస్తూ రాజధాని అమరావతిలో అమరజీ పొట్టి శ్రీరాములు ట్రస్ట్‌కు 6 ఎకరాల 80 సెంట్లు స్థలం కేటాయించి, 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని నెలకొల్పి స్మృతివనం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొర్లపర రాము, గౌరవాధ్యక్షులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో తణుకుకు మూడోస్థానం

సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎంఎల్ఎ ఆరిమిల్లి

తణుకు : పారిశుధ్య నిర్వహణలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఐవిఆర్ఎస్ సర్వేలో రాష్ట్రస్థాయిలోనే తణుకు పట్టణం మూడో స్థానంలో నిలిచిందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రాబోయే రోజుల్లో మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ చేపట్టి, దోమల నివారణకు కృషిచేసి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం తణుకు పట్టణంలోని 2, 4 వార్డుల్లో ఇంటింటికీ పర్యటించిన ఎంఎల్ఎ గత ఏడాదిగా అందుతున్న సంక్షేమం అడిగి తెలుసుకున్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిచక్రవర్తి ఆకస్మిక మృతి

నరసాపురం: మండలంలోని తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన టిడిపి మాజీ మండల ఉపాధ్యక్షులు గుత్తుల బలిచక్రవర్తి(65) బుధవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన రెండుసార్లు ఎంపిటిసిగా, సొసైటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన పార్థివదేహాన్ని విప్ నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, టిడిపి ఇన్‌ఛార్జి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నేడు జాబ్ మేళా

నరసాపురం : నరసాపురం పట్టణంలోని శ్రీసూర్య డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు శ్రీసూర్య విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మంతెన ప్రవళ్లిక ఒక ప్రకటనలో తెలియజేశారు. నేషనల్ కెరీర్ సర్వీస్ ఎంసిసి భీమవరం ఉద్యోగ దిక్సూచి కార్యక్రమంలో భాగంగా డివిస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ సంస్థలో ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్ విభాగంలో ట్రెయినీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. రూ.18 వేల నుంచి రూ.24 వరకు నెలసరి జీతం అన్నారు. బిఎస్‌సి కెమిస్ట్రీ, బిఫార్మసీ, బీటెక్ కెమికల్, మెకానికల్, ఎంఎస్‌సి ఎన్విరాన్‌మెంటల్ ఆర్గానిక్, ఎంఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు గురువారం ఉదయం 9 గంటలకు నరసాపురం శ్రీసూర్య కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళాకు బయోడేటా, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 7981602528ను సంప్రదించాలని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తాడేపల్లిగూడెం : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం, మరో వ్యక్తికి గాయాలైన ఘటన బుధవారం పెదతాడేపల్లి జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ద్వారకాతిరుమల మండలంలోని చెందిన డి.శ్రీను అనే వ్యక్తి బుధవారం తెల్లవారుజామున గేదెల పేడ గురించి ట్రాక్టర్ మీద దువ్వకి బయలుదేరాడు. ఈ నేపథ్యంలో గుంటూరు సమీపంలోని పెదకొరపాడుకు చెందిన పి.హరి అనే వ్యక్తి మామిడికాయల లోడుతో పెద్ద తిరుపతి నుంచి తణుకు మిని వ్యాన్‌లో బయలు దేరాడు. ఈ తరుణంలో పెదతాడేపల్లి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను మినీ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ శ్రీను(40) ఘటన స్థలంలోనే మృతిచెందాడు. వ్యాన్ డ్రైవర్ తలకు బలమైన గాయం తగలడంతో పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు శ్రీనివాస్‌కు ఇద్దరు పిల్లలు అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపుల కేసులో..

ముద్దాయిలకు ఆరేళ్ల జైలు శిక్ష

నరసాపురం : మైనర్ బాలికపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు ముద్దాయిలను దోషులుగా తేలుస్తూ భీమవరం పోక్సో కోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ తీర్పు ఇచ్చారు. ముద్దాయిలకు 6 సంవత్సరాల కఠిన జైలు శిక్ష, ఒక్కొరికి రూ.25 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారని నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద్ చెప్పారు. బుధవారం మండలం వేములదీవికి చెందిన ఒక బాలికపై అదే గ్రామానికి చెందిన మైలాబత్తుల దిలీప్ కుమార్, బాలం శివ 2016 మే 5వ తేదీన గ్రామంలో ఓ మేకల షెడ్డు వద్ద వేధింపులకు పాల్పడ్డారు. బాలిక ముదునూరోళ్ల బంధువు 9వ తేదీన మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అప్పటి ఎస్ఐ డీజే రత్నం పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసులో దోషులుగా తేల్చిన మైలాబత్తుల దిలీప్ కుమార్, బాలం శివలకు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి బి.లక్ష్మీనారాయణ తీర్పు చెప్పారు. బాధిత బాలికకు రూ.40 వేలు నష్టపరిహారం అందించాలని కోర్టు లీగల్ కౌన్సిల్ సిఫార్సు చేసింది.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉద్యోగావకాశాలున్న కోర్సులను ఎంపిక చేసుకోవాలి

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభంలో కలెక్టర్ నాగరాణి

కంప్యూటర్ ల్యాబ్‌ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కోర్సుల ఎంపికలో ఒకరిని అనుసరించకుండా ఉద్యోగావకాశాలు ఉన్న కోర్సులను ఎంపిక చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యార్థులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రాయలం రోడ్డులోని రాజారామ్మోహన్ రాయ్ ద్వి శతజయంతి(ఆర్ఆర్ డిఎస్) డిగ్రీ కాలేజీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత సిఎస్ఆర్ ఫండ్స్ రూ.5 లక్షల 60 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ డిగ్రీ కోర్సు ఏమి తక్కువ కాదని, కష్టపడి చదివితే ఏకోర్సులోనైనా ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. ఇటీవల ఇంజనీరింగ్ కోర్సుల మీద మక్కువతో ఎక్కువమంది వాటిలో చేరి ఉద్యోగావకాశాలు రాక ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితులను చూస్తున్నామన్నారు. డిగ్రీ కోర్సులు, సాంకేతిక విద్య అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో సత్వర ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నాయన్నారు. ఈరోజు సిఎస్ఆర్ ఫండ్స్ నుంచి తాను ఆర్ఆర్‌డిఎస్ డిగ్రీ కాలేజీకి 10 కంప్యూటర్లు ఇవ్వడం పెద్ద విషయం కాదన్నారు. అది తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. మహోన్నత ఆశయంతో మూర్తిరాజు స్థాపించిన కళాశాలలకు ఏ సహాయం కావాలన్నా తన వంతుగా అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ వికెజె.ప్రసూన మాట్లాడుతూ అడిగిన వెంటనే కంప్యూటర్లు అందించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల తరపున కలెక్టర్‌ను సత్కరించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.లక్ష్మీకాంతం, డాక్టర్ పి.అరవిందస్వామి, డాక్టర్ కె.శ్రీనివాసరావు, జి.ఉమామహేశ్వరి, డివివి సిహెచ్ సత్యనారాయణ, కంప్యూటర్ ల్యాబ్ అధ్యాపకులు జి.ప్రసాద్‌బాబు, లైబ్రేరియన్ ఎల్.నరసింహారావు పాల్గొన్నారు.

దొడ్డనపూడి ఉపసర్పంచిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడి గ్రామపంచాయతీ ఉపసర్పంచిగా కుంకుట్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత ఉపసర్పంచి కొప్పర్తి ఏసురాజు తన పదవికి రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు డిప్యూటీ ఎంపిడిఒ ఎంవి.భాస్కరరావు బుధవారం ఉదయం సర్పంచి, వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. 10వ వార్డు సభ్యుడు కుంకుట్ల శ్రీనివాస్‌ను మిగతా వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఉపసర్పంచిగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డిగా రాంబాబు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండల ఇఒపిఆర్‌డిగా వల్లభు రాంబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. చాలా కాలంగా ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న పెనుమంట్ర గ్రామ కార్యదర్శి పి.సీతారామయ్య నుంచి బాధ్యతలు తీసుకున్నారు. పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామ పంచాయతీలో గ్రేడ్-1 సెక్రటరీగా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్ మీద వచ్చినట్టు రాంబాబు తెలిపారు. మండలంలోని సదరు శాఖ కార్యక్రమాలు అవగాహన చేసుకుని, తన విధులను ప్రజలకు ఉపయోగకరంగా నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

21న వికలాంగులకు ఉపకరణాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకారణాలు అందించడానికి ఈనెల 21 సోమవారం ఉదయం పెనుగొండ పంచాయతీ ప్రాంగణంలో శిబిరం జరుగుతుందని ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు బుధవారం ఇక్కడ తెలిపారు. ఈ క్యాంపు గురించి ఆయా పంచాయతీ కార్యదర్శులు అన్ని గ్రామాలు, శివారు గ్రామాల్లో మైకు ద్వారా ప్రచారం చేయించాలని ఆయన ఆదేశించారు. శిబిరానికి హాజరయ్యే లబ్ధిదారులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆయన కోరారు.

ఎరువుల దుఖాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎరువుల కంపెనీల స్టాక్ పాయింట్లు, హోల్ సేల్ డీలర్ల స్టాక్ పాయింట్లను తనిఖీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా కోరమండల్ స్టాక్ పాయింట్, ఎఫ్ఎంసి కంపెనీ గోడౌన్స్ అమ్మకాల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎంసి గోడౌన్‌లో పరిశీలించగా సరైన వివరాలు నమోదు కానీ సూక్ష్మపోషక ఎరువులు, బయోస్టిమ్యులెంట్స్ గుర్తించి సుమారు రూ.22,42,950 విలువ చేసే ఎరువులను సీజ్ చేసి అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ తనిఖీలలో పెద్దాపురం జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు బుల్లిబాబు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గోపాలకృష్ణ, ఎడిఎఆర్ గంగాధర్ రావు, మండల వ్యవసాయాధికారి వి.నారాయణరావు, వ్యవసాయాధికారి(టెక్నికల్) కృష్ణ కాంత్, ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజానికి ఆదర్శం సూరంపూడి జీవితం

ఎపిడబ్ల్యూజె ప్రెస్ క్లబ్ ఆధ్వర్యాన సంస్మరణ సభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పాత్రికేయుడిగా, ఉపాధ్యాయుడిగా, నటుడిగా సూరంపూడి వెంకటరమణ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని, ఆయన జీవితం సమాజానికి ఆదర్శనీయమని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. తాడేపల్లిగూడెం జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెస్ క్లబ్ ఎపిడబ్ల్యూజె అనుబంధం ఆధ్వర్యంలో కీర్తిశేషులు సూరంపూడి వెంకటరమణ సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జర్నలిస్టులు సూరంపూడి వెంకటరమణ చిత్రపటానికి పుష్పాంజలితో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ఎపిడబ్ల్యూజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్లపల్లి మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్, సిపిఎం నాయకులు చింతకాయల బాబురావు, పి.గోవిందు, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు సంతాపం వ్యక్తంచేశారు.

నష్టపరిహారం లాభసాటిగా ఇవ్వాలి : రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

ఎన్‌హెచ్ 165 భూసేకరణకు అభ్యంతరం లేదని, నష్టపరిహారం లాభసాటిగా ఉండేలా చూడాలని రైతులు జెసి టి.రాహులకుమార్ రెడ్డిని కోరారు. జాతీయ రహదారి 165 నిర్మాణంలో భాగంగా పెదఅమిరం, జక్కరం, వేంపాడు, కోపల్లె గ్రామాల రైతులు లేవనెత్తిన 54 అభ్యంతరాలపై జెసి కాళ్ల తహశీల్దార్ కార్యాలయంలో రైతులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. తమ భూమికి లభించే నష్టపరిహారం చెల్లింపు, తదితర విషయాలను జెసి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విచారణలో తహశీల్దార్ జి.సుందర్ సింగ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జె.వెంకట్, కలెక్టరేట్ సిబ్బంది, విఆర్ఒలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పాఠశాల భద్రతా, ఆరోగ్య దినోత్సవం

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ పాఠశాల భద్రత, ఆరోగ్య దినోత్సవం కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ తమిళనాడులోని కుంభకోణంలో 2004 జులై 16న అగ్ని ప్రమాదం జరిగి 90 మంది చిన్నారులు మరణించారని చెప్పారు. ఆ సంఘటనకు భారత ప్రభుత్వం స్పందించి ప్రతి సంవత్సరం జులై 16న జాతీయ పాఠశాల భద్రత, ఆరోగ్య దినోత్సవంగా ప్రకటించారని చెప్పారు. ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యాలు, పాఠశాల భద్రతపై అవగాహన, పాఠశాలలో విద్యార్థులు, సిబ్బంది, సందర్శకుల భద్రతకు సంబంధించిన ప్రాముఖ్యత తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

దాతృత్వాన్ని అలవర్చుకోవాలి : ఎంఎల్ఎ

తణుకు : ఎంత ఆస్తులు సంపాదించినప్పటికీ సమాజం కోసం ఎంతో కొంత ఖర్చు పెడుతూ సమాజాభివృద్ధికి కృషిచేస్తూ ప్రతి ఒక్కరూ దాతృత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం అత్తిలి మండలం వరిఘేడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సుమారు రూ.6 లక్షల వ్యయంతో గ్రామానికి చెందిన అడ్డాల కృష్ణారావు, అనంతలక్ష్మి దంపతుల కుమారులు నిర్మించిన కళావేదిక ప్రారంభోత్సవంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉంటూ విదేశాల్లో స్థిరపడినప్పటికీ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థానికంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కళావేదిక నిర్మించడం అభినందనీయమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అదే దాతృత్వంతో గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు జన్మభూమి కార్యక్రమం ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా తల్లిదండ్రుల కమిటీ, విద్యా కమిటీ సభ్యులు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిట్టూరి రామకృష్ణ ఆశయ సాధనకు కృషి

వర్ధంతి కార్యక్రమంలో వక్తలు

స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న వల్లూరు గ్రామస్తులు

ప్రజాశక్తి - ఆచంట

ప్రజల కోసం జీవించేవారు మరణించినా ప్రజల హృదయాల్లో స్థిర స్థాయిగా జీవించే ఉంటారని వల్లూరు సర్పంచి నేలపూడి బేబి అన్నారు. వల్లూరు మాజీ సర్పంచి, సిపిఎం నాయకులు చిట్టూరి రామకృష్ణ 15వ వర్ధంతిని వల్లూరు సెంటర్లోని ఆయన స్థూపం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కుటుంబ సభ్యులు చిట్టూరి రాంబాబు తన తండ్రి చిట్టూరి రామకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు మైలే ఏసురత్నం మాట్లాడుతూ తన చివరి శ్వాస వరకూ ఉద్యమమే ఊపిరిగా జీవించిన వ్యక్తి రామకృష్ణ అన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజా ఉద్యమంలో కూడా రామకృష్ణ తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. వల్లూరు సర్పంచిగా ఆయన చేసిన సేవలు ఇప్పటికీ ప్రజల హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి గెద్దాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, దేవళ్ల రమేష్, ఏడిది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అల్లం విజయలక్ష్మి సేవలు అభినందనీయం

ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారావు

ప్రజాశక్తి - భీమవరం

ప్రముఖ రైస్ మిల్లర్ అల్లం నాగ వెంకట రమేష్, అప్పాజీ తల్లి అల్లం విజయలక్ష్మి చేసిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్యాడీ రైస్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు చవ్వాకుల నరసింహారావు కొనియాడారు. ఈనెల 13న విజయలక్ష్మి అకాల మరణం చెందారు. దీనిలో భాగంగా భీమవరం ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో విజయలక్ష్మి సంతాప సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారావు మాట్లాడుతూ అల్లం విజయలక్ష్మి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. అనేక మందికి సహాయం చేశారని కొనియాడారు. అనంతరం ఈ సభలో పాల్గొన్న ప్రముఖులు అల్లం విజయలక్ష్మి సేవలు కొనియాడి సంతాపం తెలియజేసి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈ సభలో ప్యాడీ అండ్ రైస్ మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి ఇన్నమూరి నాగేశ్వరరావు, కోశాధికారి బదరాల పుల్లేశ్వరం, సభ్యులు చెక్క సుబ్బారావు, కొత్త శ్రీనివాస్, రావూరి వెంకటేశ్వరరావు, మెంటే హనుమకృష్ణ, పరుచూరి చిన్న నాగేశ్వరావు, ఇన్నమూరు చలపతిరావు, తిరుపతిరావు, ఇన్నమూరి సురేష్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ఇంటర్నేషనల్ ర్యాంక్‌లు

తాడేపల్లిగూడెం : ప్రపంచవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన సైన్స్ అండ్ ఒలింపియాడ్ ఫౌండేషన్ పరీక్షలో ఐదుగురు విద్యార్థులు ఇంటర్నేషనల్ స్థాయిలో ర్యాంకులు సాధించారని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు అన్నారు. బుధవారం పెద తాడేపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ పరీక్షకు 158 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ఐదుగురు విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్థాయిలో ర్యాంకులు లభించడం అభినందనీయమన్నారు. సిహెచ్.సాహస్ హిందీలో 131వ ర్యాంకు, డి.హర్షవర్ధన్ హిందీలో 150 ర్యాంకు, ఎ.పాల్సన్ హిందీలో 149వ ర్యాంకు, జి.హర్షవర్ధన్ హిందీలో 176వ ర్యాంకు, టి.మురళీ మ్యాథ్స్‌లో 1210వ ర్యాంకులు సాధించడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు.

7వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటన

నరసాపురం: పట్టణంలోని 7వ వార్డులో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పర్యటించి పారిశుధ్య పనులను, డ్రెయిన్ పూడికతీత పనులను పరిశీలించారు. ఆయా వార్డుల్లో దట్టంగా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. నీటిసరఫరా పైపులను లీకులు గుర్తించి మరమ్మతులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్యలపై అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. మురికి కాలువలో ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రుడు, సచివాలయ సిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన బండారు

బండారుకి పుస్తకాన్ని అందిస్తున్న లోకేష్

నరసాపురం : రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్‌టిజి శాఖ మంత్రి నారా లోకేష్‌ను నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. అమరావతిలోని ముఖ్యమంత్రి నివాసంలో నారా లోకేష్‌ను కలిసి నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై, ప్రాంతాభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం యువగళం పాదయాత్ర విశేషాలను పొందుపరిచిన 'ది వాయిస్ ఆఫ్ పీపుల్' పుస్తకాన్ని నారా లోకేష్ మాధవ నాయుడుకి అందజేశారు.

ఉండి రూరల్ బ్యాంక్ డైరెక్టర్‌గా జివి.సత్యనారాయణ

ఉండి : ఉండి విశాల పరపతి సహకార సంఘం త్రిసభ్య కమిటీ డైరెక్టర్‌గా ఉండి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ నియామకమయ్యారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులు సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తన గురువు వేగేశ్న కనకరాజు సూరి చైర్మన్‌గా ఉన్న త్రిసభ్య కమిటీలో తనకు డైరెక్టర్ పదవి రావడం తన అదృష్టమని తెలిపారు.

విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : ఎంఎల్ఎ

తణుకు : తణుకు నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల ప్రతిష్టాత్మంగా ప్రారంభించిన మీ సమస్య మా పరిష్కారం ద్వారా వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 20/2022
Between:
వాది:
1. Relangi Srujan Sri Surya
2. Relangi Ashwita
3. Relangi Ashwin
Plaintiffs 1 to 3 being minors rep. by next guardian mother sri Relangi Sujani, W/o. Suri Babu, D.No. 1-105, Kurupalli, Nidadavolu Mandal, E.G.Dist.,
ప్రతివాద్లు: Relangi Suribabu and Others
(D-6): Kedarsetti Krishnaveni, W/o. Lakshmana Rao, D.No. 1-23, Pamulavarigudem, Jeelugumilli Mandal, W.G.Dist.,
వాయిదా: 25-7-2025
పై నెంబరు దావాలోని మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారాను మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకముగా నిరాకరించుచున్నారు. కావున మీరు పై తెలిపిన తేది నందు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి సమక్షమున స్వయంగా గాని, లేదా వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీకు ఆక్షేపణలు ఏవైనా ఉన్నచో తెలియపర్చుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
కె.ఎస్.రాఘవులు, అడ్వకేట్
కొవ్వూరు, సెల్: 9441116118

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No.487/2024
Between:
కూనపరెడ్డి వెంకట శివప్రసాద్ ...వాది
And
గుబ్బల నాగేశ్వరరావు ...ప్రతివాది
ప్రతివాది: గుబ్బల నాగేశ్వరరావు, తండ్రి నరసింహయ్య, C/o.కడలి ముత్యాల వెంకట సత్యనారాయణ, వయస్సు 39 సం॥లు, హిందు, పురుషుడు, వ్యాపారం, డోర్‌నెం.19-42, కుక్కలవారి తోట, మొగల్తూరు గ్రామం, మొగల్తూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. NSP CJ (Jr.D) Court. సెల్.6305041402.
పిటీషనర్/వాది తరుపున దాఖలు చేసిన పత్రికా ప్రకటన
పై నంబరు దావాలో వాది పలుమార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా నిరాకరించినందున ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసు అమలు చేయటమైనది. కావున పై కోర్టు వారి ఎదుట **ది.18-08-2025 ఉదయం 10.30** గంటలకు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరయ్యి పై దావా గ్రంథంలో మీ సమాదానం తెలియజేయవలెను. లేనియెడల మీపై శ్రీకోర్టు వారు పరోక్షముగా ఉత్తర్వులు జారి చేసి తీర్మానము చేయుదురు అని ఇందుమూలముగా మీకు తెలియజేయటమైనది. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పేపర్ ప్రకటన ఇవ్వటమైనది)
కోటి వెంకట్రామయ్య
భీమవరం అడ్వకేట్, కాళ్ళ
ది.17-07-2025 సెల్: 9849356865

ప్రకటన
మహారాజశ్రీ కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No.460/2024 in O.S.No.144/2018
Between:
నాగదాశి అర్జునరావు ...పిటీషనరు/వాది
And
కాశి వెంకటేశ్వరరావు (Died) 5 Others ...రెస్పాండెంట్లు /ప్రతివాదులు
To.
R3. కారి వేణుగోపాలరావు, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 43 సం॥లు, ఉద్యోగి
R4. కారి బసవయ్య, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 39 సం॥లు, ఉద్యోగం
ఇద్దరిది గురజ గ్రామం, ముదినేపల్లి మండలం, కైకలూరు JCJC.
పై నంబరు దావాలోని I.A.No.460/2024 లో నోటీసు నిమిత్తంగా, మీకు పలుమార్లు కోర్టు ద్వారా రిజిష్టరు పోస్టు ద్వారా నోటీసు పంపగా మీరు ఉద్దేశ్యపూర్వకంగా, తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పేపరు ప్రకటన ద్వారా తెలిజేయునది ఏమనగా ది.**24-7-2025**న వాయిదా అయి ఉన్నది. మీరు గాని మీ తరపు న్యాయవాది గారు వాయిదా రోజు ఉదయం గం.10.30 ని॥లకు కోర్టుకు హాజరు కావలసి ఉన్నది. లేనియెడల పరోక్షమున తీర్మానించెదరు. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కాశి శరత్‌బాబు
పిటీషనరు తరపు న్యాయవాది
కైకలూరు కైకలూరు.
తేది.16-7-2025 సెల్: 9440331282.

ప్రకటన
మహారాజశ్రీ కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No.461/2024 in O.S.No.144/2018
Between:
నాగదాశి అర్జునరావు ...పిటీషనరు/వాది
And
కాశి వెంకటేశ్వరరావు (Died) 5 Others ...రెస్పాండెంట్లు /ప్రతివాదులు
To.
R3. కారి వేణుగోపాలరావు, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 43 సం॥లు, ఉద్యోగి
R4. కారి బసవయ్య, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 39 సం॥లు, ఉద్యోగం
ఇద్దరిది గురజ గ్రామం, ముదినేపల్లి మండలం, కైకలూరు JCJC.
పై నంబరు దావాలోని I.A.No.461/2024 లో నోటీసు నిమిత్తంగా, మీకు పలుమార్లు కోర్టు ద్వారా రిజిష్టరు పోస్టు ద్వారా నోటీసు పంపగా మీరు ఉద్దేశ్యపూర్వకంగా, తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పేపరు ప్రకటన ద్వారా తెలిజేయునది ఏమనగా ది.**24-7-2025**న వాయిదా అయి ఉన్నది. మీరు గాని మీ తరపు న్యాయవాది గారు వాయిదా రోజు ఉదయం గం.10.30 ని॥లకు కోర్టుకు హాజరు కావలసి ఉన్నది. లేనియెడల పరోక్షమున తీర్మానించెదరు. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కాశి శరత్‌బాబు
పిటీషనరు తరపు న్యాయవాది
కైకలూరు కైకలూరు.
తేది.16-7-2025 సెల్: 9440331282.

ప్రకటన
మహారాజశ్రీ కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No.462/2024 in O.S.No.144/2018
Between:
నాగదాశి అర్జునరావు ...పిటీషనరు/వాది
And
కాశి వెంకటేశ్వరరావు (Died) 5 Others ...రెస్పాండెంట్లు /ప్రతివాదులు
To.
R3. కారి వేణుగోపాలరావు, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 43 సం॥లు, ఉద్యోగి
R4. కారి బసవయ్య, S/o.వెంకటేశ్వరరావు, హిందు, 39 సం॥లు, ఉద్యోగం
ఇద్దరిది గురజ గ్రామం, ముదినేపల్లి మండలం, కైకలూరు JCJC.
పై నంబరు దావాలోని I.A.No.462/2024 లో నోటీసు నిమిత్తంగా, మీకు పలుమార్లు కోర్టు ద్వారా రిజిష్టరు పోస్టు ద్వారా నోటీసు పంపగా మీరు ఉద్దేశ్యపూర్వకంగా, తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పేపరు ప్రకటన ద్వారా తెలిజేయునది ఏమనగా ది.**24-7-2025**న వాయిదా అయి ఉన్నది. మీరు గాని మీ తరపు న్యాయవాది గారు వాయిదా రోజు ఉదయం గం.10.30 ని॥లకు కోర్టుకు హాజరు కావలసి ఉన్నది. లేనియెడల పరోక్షమున తీర్మానించెదరు. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కాశి శరత్‌బాబు
పిటీషనరు తరపు న్యాయవాది
కైకలూరు కైకలూరు.
తేది.16-7-2025 సెల్: 9440331282.

నోటీసు
మహారాజశ్రీ XI అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో
ఏ.ఎస్.నెం.13/2025
బిట్వీన్
1.బొండ బంగారమ్మ ...అప్పిల్లెంట్
మరియు
1.పంతం నాగ పుష్పావతి & 2 అదర్స్ ...రెస్పాండెంట్స్
3వ రెస్పాండెంట్ :
బొమ్మదేవర జ్యోతి, W/o.ఉదయవర్లు, స్త్రీ, వయస్సు 39 సం॥లు, ఆస్తులు, C/o.పంతం నాగ పుష్పావతి, డోరునెం.10-2-7, గుడిమెట్ల నరసమ్మ ఇంటి వద్ద, తాళ్ళముదునూరుపాడు, 18వ వార్డు, తాడేపల్లిగూడెం, TPG ADJC.
పై అప్పీలులో 3వ రెస్పాండెంట్ అయిన మీరు పై అప్పీలు నందు నోటీసు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఇందుతో తెలియచేయునది ఏమనగా పై అప్పీలు **ది.31-07-2025వ** తేదీకి మీ హాజరు కొరకు వాయిదా అయి ఉన్నది. సదరు **ది.31-07-2025వ** తేదీన ఉదయం 10.30 ని॥ల లగాయితూ పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని హాజరై పై అప్పీలు నందు మీ ఆక్షేపణలు తెలియచేయవలసినది. లేనిచో పై అప్పీలు మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
కొవ్వూరి అప్పిరెడ్డి, న్యాయవాది, తాడేపల్లిగూడెం-534102.
తాడేపల్లిగూడెం ఫోన్: 9959594995
తేది.16-07-2025 9440128616